క్లుప్తంగా

అందరికీ వైద్య సేవలు అందాలి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న జడ్జి హేమ

ఆలూరు: ప్రజలందరికీ వైద్య సేవలు అందాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమ సూచించారు. సోమవారం హొళగుంద మండలం నెరణికి గ్రామంలో సర్పంచ్ దుర్గాబాయ్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 104 వైద్య సిబ్బంది గ్రామంలోని గిరిజనులకు వైద్యపరీక్షలు చేశారు. అనంతరం రోగులకు ఎలాంటి సేవలను అందిస్తున్నారని డాక్టర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. న్యాయ వాదులు లక్ష్మీకాంతం, సిద్దప్ప తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

ఆలూరు: గ్రామ పంచాయతీల్లో పారుశుద్ధ్య పనులపై పీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని పత్తికొండ ఇన్‌చార్జ్ డివిజనల్ పంచాయతీ అధికారి ప్రకాష్‌నాయుడు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మురుగు, చెత్తాచెదారం పేరుకు పోయినట్లు ఆలూరు, దేవనకొండ, ఆస్పరి, తుగ్గలి మండలాలను చెందిన ప్రజాప్రతినిధుల నుంచి తనకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. సమస్యల పరిష్కారానికి ఆయా పంచాయతీ కార్యదర్శులకు ఫోన్ ద్వారా సమాచారాన్ని తెలియజేసినట్లు చెప్పారు. ప్రత్యేకంగా పారుశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌లకు సూచించినట్లు డీఎల్‌పీఓ తెలిపారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

హొళగుంద: శ్రావణమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని వీరభద్రేశ్వరస్వామి, సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో రుద్రాభిషేకంతో పాటు మహామంగళహారతి, కాకడ హారతి కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళహారతి, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు, ఆకులు, పూలతో అలంకరణను చేశారు.

స్వాతంత్య్ర వేడుకలకు మద్దికెర విద్యార్థి

మద్దికెర: ఈనెల 15న జరిగే స్వాతంత్య్ర వేడుకలకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు చెందిన శివకుమార్ వెళ్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే మార్చ్ ఫాస్ట్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ విరాళం



మైక్‌సెట్‌ను అందజేస్తున్న బసవరాజు

హొళగుంద: చిన్నహ్యాట కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బీరప్ప కుమారుడు కురువ బసవరాజు సోమవారం వైర్‌లెస్ మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. పాఠశాలలో ఉదయం ప్రేయర్‌తో పాటు ఇతర కార్యక్రమాలకు మైక్‌సెట్ లేకపోవడంతో ఇబ్బందిగా ఉండేది. విషయం తెలుసుకున్న బసవరాజు తనవంత సహాయంగా తండ్రి జ్ఞాపకార్థం రూ.12 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను కొని పాఠశాలకు అందజేశారు. దీంతో పాఠశాల హెచ్‌ఎం దొడ్డబసప్ప, ఉపాధ్యాయులు బీటీ ఖలందర్, గురుబసవరాజు, రాజేశ్వరి, భారతి తదితరులు బసవరాజును సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

వర్షం కోసం సప్త భజన

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో వర్షం కోసం ఈశ్వర స్వామి ఆలయంలో సోమవారం గ్రామస్తులు సప్త భజన చేపట్టారు. ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో వర్షాలు కురిసిన పంటలు బాగా పండి ప్రజలు ప్రశాంతంగా ఉండాలని భజన చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ముగిసిన ఉపాధి గ్రామసభలు

కృష్ణగిరి: సామాజిక తనిఖీ గ్రామసభలు ముగిసినట్లు ఏపీఓ శేషిరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కంబాలపాడు, చిట్యాల, తొగర్చేడు, టి.గోకులపాడు గ్రామాల్లో జరిగిన ఉపాధి సామాజిక తనిఖీ గ్రామసభలను ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఆయన నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆడిట్ అధికారులు గుర్తించిన విషయాలు గ్రామసభల్లో చదివి వినిపించారు. పలుచోట్ల మస్టర్ల నిర్వహణ సక్రమంగా లేదన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఆర్‌పీ విజయభాస్కర్ తెలిపారు.

ఇలా చేస్తారనుకోలేదు



నాపేరు భారిక సుంకమ్మ, మాది మొలగవెల్లి గ్రామం, నాకు నవదాలంటే మొకాళ్ల నొప్పులు. నాకు కార్డు ఉంది. ఇప్పటి వరకు మా ఇంటి వద్దకు వచ్చి తంబు వేయించుకుని వాహనం ద్వారా బియ్యం, బేడలు, చక్కర పంపిణీ చేసేవారు. చంద్రబాబు ప్రభుత్వం రేషన్ కార్డుల సరుకులను డీలరు ఇంటికి వెళ్లి తెచ్చుకోవాలని చెబుతోంది. ఇలా చేస్తారని అనుకోలేదు. కనీసం మాలింటి వృద్ధులు రేషన్ దుకాణానికి వెళ్లాలంటే ఇబ్బంది. నేనే డీలరు ఇంటి కాడికి వెళ్లి తంబు వేయాలి. ఇది చాలా కష్టం. అక్కడ ఎక్కువ సేపు వేచి ఉండాలి. ఇప్పుడు మళ్లీ పాత కష్టాలను ఎదుర్కోవాలి.

అడుగేయలేను



నాపేరు బోయ మంగమ్మ, మాది మొలగవెల్లి గ్రామం, నేను నడవడం చేతకాదు. ఇప్పటి వరకు రేషన్ బండి ఇంటి కాడికి వచ్చి, వేలిముద్ర వేయించుకొని సరుకులు ఇచ్చేవారు. ఇప్పుడు బండి రాదంటున్నారు. నాకు దిక్కు దిక్కెవరు. ఇప్పుడు డీలరు ఇంటికి వెళ్లలేను. సరుకులు ఎలా తెచ్చుకోవాలి. నాలాంటి ముసలోళ్లను దృష్టిలో పెట్టుకొని రేషన్ బండిని కొనసాగించాలి.

రేషన్ బండి..ఇక రాదండి!

- ఆటకెక్కనున్న ఇంటింటికీ రేషన్
- ఎండీయూ వాహనాలకు కూటమి ప్రభుత్వం మంగళం
- ఇప్పటికే చక్కెర, కందిపప్పు కోత
- ఆందోళనలో తెల్లరేషన్‌కార్డుదారులు



మొలగవెల్లిలో నిత్యవసరాల సరుకుల పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం (ఫైల్)

ఆలూరు/తుగ్గలి: కొత్త ప్రభుత్వం వచ్చింది.. మంచి చేస్తుందని ప్రజలు ఆశించడం సహజం. అయితే తొలి నెలలోనే కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా పేదలకు ఆవేదన మిగిల్చింది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరో అడుగు ముందుకేశారు. ఎండీయూ వాహనాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఇప్పటికే పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా 'ఇంటింటికీ రేషన్ పంపిణీ మూర్ఖపు నిర్ణయం..రేషన్ పంపిణీ చేసే డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ) వల్ల తీవ్ర నష్టం కలుగుతోంది. త్వరలో రేషన్ డోర్ డెలివరీ చర్చించి నిర్ణయం తీసుకుంటా' అని కూడా చెప్పారు. ఎండీయూ సిస్టం రద్దుచేసి డీలర్ వద్దకే లబ్ధిదారులు వెళ్లే పాత విధానాన్నే అమలు చేస్తారని, ఇక రేషన్ కోసం గంటలు, రోజుల తరబడి చౌక దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న ఆవేదన లబ్ధిదారుల్లో కనిపిస్తోంది. రేషన్ బండి ఇక రాదంట అంటూ గ్రామాల్లో చర్చ సాగుతోంది.

ఒక్కొక్కటిగా నిర్మూలించే ప్రయత్నం..

నిరుపేదలకు మేలుచేసే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలను ఒక్కొక్కటీ అటకెక్కించే కుట్రలకు కూటమి ప్రభుత్వం తెరలేపింది. అందులోభాగంగా ఇంటింటికీ రేషన్ అందించే వాహన సేవలకు మంగళం పాడేందుకు సన్నద్ధమవుతోంది. ఇంటింటికీ రేషన్ ప్రక్రియను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్డుదారులకు ఇంటిముందికే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఇంటింటికీ రేషన్ పంపిణీకి ఎండీయూ వాహన నిర్వాహకులతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పుడు ఉన్నఫళంగా పథకాన్ని రద్దుచేస్తే ఒప్పందం సంగతేమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతున్నారు.

పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో రేషన్ షాపులు, కార్డుదారులు, ఎండీయూ వాహన వివరాలు ఇలా..

మండలం	చౌక దుకాణాలు	రేషన్ కార్డులు	ఎండీయూ వాహనాలు
పత్తికొండ	38	19,332	08
తుగ్గలి	47	19,606	11
మద్దికెర	24	10,760	07
కృష్ణగిరి	28	12,398	14
వెల్దుర్తి	44	18,453	18
ఆలూరు	31	16,375	10
చిప్పగిరి	24	8,754	5
హాలహర్వి	29	12,772	7
హొళగుంద	32	17,664	10
ఆస్పరి	34	17,500	12
దేవనకొండ	14	25,000	13

రద్దు చేయొద్దు



గత ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఎండియూ వ్యవస్థతో నిరుద్యోగులకు కొంత ఉపాధి కలిగింది. రేషన్ కార్డుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు అందిస్తున్నాం. ఎండియూ వాహనదారులకు కూలీ పాటు వస్తోంది. ఈ వ్యవస్థను రద్దు చేసే ఆలోచన ప్రభుత్వం పునరాలోచించాలి.

– శ్రీనివాసులు ఎండీయూ వాహనదారుడు, జొన్నగిరి

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలి



నాపేరు లక్ష్మీదేవి నాకు 70 ఏళ్లు చౌకదుకాణానికి వెళ్లి ప్రభుత్వం అందజేసే నిత్యావసరులు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వయసు సహకరించదు. సరుకుల కోసం ఇతరులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పుడు ఇస్తున్నట్లే ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తే బాగుంటుంది.

– లక్ష్మీదేవి, మద్దికెర

రేషన్ మోసుకురావాలంటే ఇబ్బంది



ఇంటి దగ్గరికే బండి వచ్చి స్టోర్ బియ్యం, బ్యాళ్లు ఇస్తున్నారు. బండి రాకపోతే మాలాంటి ముసలోళ్లు స్టోర్ దగ్గరికి వెళ్లి తీసుకొచ్చుకోవాలంటే చేత కాదు నాయనా. ఇప్పుడే బాగుంది. ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. తీసేయకుండా ప్రభుత్వం కొనసాగించాలి.

– లక్ష్మీదేవి, పెరవలి, మద్దికెర మండలం.

మళ్లీ కష్టాలు తెస్తున్నారు



గత ప్రభుత్వంలో జగన్ రేషన్ బియ్యం ఇంటి వద్దకే పంపి సరుకులు అందేలా చేశారు. మళ్లీ ఇప్పుడు రేషన్‌సరుకులు డీలర్ వద్ద తెచ్చుకోవాలంటున్నారు. రేషన్‌బండి వచ్చేనెల నుంచి రాదంటున్నారు. బండి రాకపోతే 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న జీ.ఎర్రగుడి, గాని మిద్దెతండాకు గాని పోయి బియ్యం తెచ్చు కోవాలి. ఐదేళ్ల క్రితం వరకు నెలనెలా షాపుల వద్ద పడిగాపులు కాసి చచ్చాం. పైగా ఈ వయసులో నడిచి పోయి తెచ్చుకోవాలంటే ఎలా. ఇంటింటికీ రేషన్ కొనసాగేలా చూడాలి. ఇప్పటికే ఇంటి వద్దకు పొద్దున్నే వచ్చి ఇచ్చే పింఛన్లు ఇవ్వకుండా చేశారు.

– రాముడు నాయక్, జొన్నతండా, తుగ్గలి మండలం

ఆలంకొండ పోవాల్సి వస్తుంది



మాది పెద్దొడ్డి గ్రామం. మా గ్రామంలో రేషన్‌షాపు లేదు. రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలంకొండ పోయి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి నాడు ఉండేది. గత వైఎస్సార్ ప్రభుత్వంలో ఇంటింటికి రేషన్ పంపిణీని మా గ్రామానికి ప్రత్యేక వాహనాల ద్వారా వచ్చి ఇంటివద్దే అందించారు. నేడు డోర్ డెలివరి వాహనాలను నిలిపివేస్తామని టీడీపీ ప్రభుత్వం ప్రకటిస్తుండడంతో మేము మరల నాటి కష్టాల పాలయ్యేలా ఈసురోమంటి దూరప్రయాణం చేసి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తుంది.

– తాదూరు నాగేశ్వరరావు, పెద్దొడి, కృష్ణగిరి మండలం

ముసలి వాళ్లు బియ్యం ఎలా తెచ్చకుంటారు



రేషన్ వాహనాలను తొలగిస్తామనే ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు. పుటకలమర్రి పంచాయతీ మజరా గ్రామం మాది. మా గ్రామంలో 250 రేషన్ కార్డులు ఉన్నాయి. పుటకలమర్రి గ్రామానికి వెళ్లాలంటే రానుపోను 4కిలోమీటర్లు దూరం ఉంటుంది. అక్కడికి ముసలి వాళ్లు వెళ్లి బియ్యం వేయించుకోవాలంటే ఎంత ఇబ్బంది పడాలి. వర్షాలు వస్తే మా గ్రామం నుంచి రెండు వంకలు దాటి పుటకలమర్రికి వెళ్లాల్సి ఉంటుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరపాలన చేయాలి కానీ, ప్రజలను ఇలా ఇబ్బందులు పాలు చేసే నిర్ణయాలు తీసుకోరాదు. రేషన్ వాహనాలను తొలగించరాదు.

– బాలకృష్ణ, వలగొండ గ్రామం.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

దేవనకొండ: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని పత్తికొండ ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, ఏఓ సురేష్‌బాబు సూచించారు. సోమవారం మండలంలోని కరివేములలో వరి పొలాలను పరిశీలించారు. తూర్పు, పడమర దిశగా మూడు మీటర్లకు ఒక అడుగు చొప్పున కచ్చితంగా కాలిబాటలు తీసుకోవాలని సూచించారు. అలాగే పత్తి పంటలను పరిశీలించి గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలను ఎకరాకు 5 నుంచి 6 వరకు అక్కడక్కడ పెట్టుకోవాలని సలహా ఇచ్చారు. వేప నూనె 5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఈఓలు రంగన్న, యోగేంద్ర, జయరామ్, వీహెచ్‌ఏ రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి



రామాంజనేయులు (ఫైల్)

హొళగుంద: మండల పరిధిలోని ముగుమానుగుంది గ్రామంలో బోయ రామాంజనేయులు(25) అనే గొర్రెల కాపరి సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సదరు యువకుడు గ్రామ శివారులో ఉన్న తమ గొర్రెల దొడ్డి వద్ద మేకలకు మేత వేసే సమయంలో పైన వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆలూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతిడికి భార్య రాజేశ్వరి కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా ప్రమాదం జరిగిన ప్రాంతంలో తీగలు కిందికు వేలాడుతున్నాయని, గతంలో కూడా ఇక్కడ ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ ..

ఆలూరు రూరల్: పొట్టకూటి కోసం లారీ నడిపేందుకు వచ్చి కర్నూలుకు చెందిన డ్రైవర్ జాఫర్ (40) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. కర్నూలు పట్టణంలోని చిత్తారి వీధికి చెందిన జాఫర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. విధి నిర్వహణలో భాగంగా రెండు రోజుల క్రితం లారీలో లోడు తీసుకుని కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌కు వెళ్లాడు. శనివారం ఛాతీలో నొప్పి రావడంతో లారీని అక్కడే ఉంచి బళ్లారికి వచ్చాడు. బళ్లారి నుంచి కర్నూలుకు వెళ్తున్న లారీలో కర్నూలుకు ప్రయాణం అయ్యాడు. అయితే శనివారం రాత్రి 11.30 గంటలకు హాలహర్వి మండలం క్షేత్రగుడి సమీపంలో గుండెనొప్పి రావడంతో కుప్పకూలీపడిపోయాడు. గమనించిన లారీ డ్రైవర్ జాఫర్‌ను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. మృతుడు జాఫర్ (40)కు భార్య రసూల, నలుగురు కుమారులు, కూతురు సంతానం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిప్పగిరి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డ ఘటన మండలంలోని కుందన గుర్తి గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. కుందనగుర్తికి చెందిన కురువ గాదిలింగప్ప, ములగిరి పెద్దన్న చిప్పగిరికి బ్యాంకు పని నిమిత్తం వస్తున్నారు. అదే సమయంలో ఆలూరు వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది గుంతకల్లు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లినట్లు బాధితుల బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కరెంట్ వైర్ చోరీ

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెరువు గ్రామ శివారులోని రైతు కురువ కొసనాపల్లె రామాంజనేయులు పొలంలో రూ.20వేల విలువ చేసే ఏబీ కేబుల్ వైరు చోరీకి గురైనట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు. పక్కనున్న రైతు బోయ శ్రీనివాసులుకు చెందిన రూ.12వేల విలువ చేసే రెండు మోటార్ల స్టార్టర్లను కూడా దుండగులు ఎత్తుకెళ్లారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



పత్తికొండలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

తుగ్గలి(పత్తికొండ): అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ సహాయ కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అల్తాఫ్ ఆవిష్కరించి మాట్లాడారు.

వెల్దుర్తి: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ దినోత్సవాన్ని సోమవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర మాజీ నాయకులు కృష్ణ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, సీపీఐ పట్టణ నాయకులు చిన్నమాదులు, శ్యాము, బాలు పాల్గొన్నారు.

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సతీష్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్‌కుమార్ ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు జనార్దన్‌నాయుడు, మండల అధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్ పాల్గొన్నారు.

ఆస్పరి: మండల కేంద్రంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఆసంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు క్రిష్ణమూర్తి, సంజయ్, ఈశ్వర్, వెంకటేష్, నవీన్, తరుణ్, మహేష్ పాల్గొన్నారు.

సంఘాలలో పారిశుద్ధ్య పనులు



జేసీబీతో మురుగును తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

చిప్పగిరి: మండలంలోని సంఘాల గ్రామంలో అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారిలో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తుండడంపై సోమవారం 'అడుగేస్తే మురుగు' అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఈఓపీఆర్డీ బాలన్న జేసీబీ సాయంతో మురుగు నీటిని, మట్టిని తొలగించి సమస్య పరిష్కరించారు. అధికారుల చర్యలపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

25 మంది నిందితుల అరెస్టు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు దినసరి కూరగాయల మార్కెట్లో ఈనెల 5వ తేదీన ఘర్షణకు పాల్పడిన టీడీపీకి చెందిన 25 మందిని ఆస్పరిలో సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. నిందితులు శ్రీను, వీరేష్, వీరేంద్ర, వీరాంజినేయులు, నాగరాజు పాటు మరో 20 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు కంటి పరీక్షలు

తుగ్గలి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం పగిడిరాయి పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 16 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి, త్వరలో కంటి అద్దాలు అందజేయనున్నారు. మరో 20 మందికి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకట రమణ, ఏఎన్‌ఎం మహాలక్ష్మి, కేజీబీవీ ఎస్‌వో షాహీన్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి

మద్దికెర: స్థానిక శ్మశాన వాటికకు ప్రహరీ లేనందున వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ప్రహరీ ఏర్పాటు చేయాలని సోమవారం తహసీల్దార్ హుసేన్‌సాహెబ్‌కు ఖాజా, ఖలీల్, సలీం తదితరులు వినతిపత్రం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



రాణెమ్మ

ఆస్పరి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓగా రాణెమ్మ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అనంతపురంకు బదిలీ కాగా, ఆయన స్థానంలో అనంతపురం జిల్లా నుంచి రాణెమ్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

తుగ్గలి: పత్తికొండ ఎంపీడీఓగా ఎం కవిత, తుగ్గలి ఎంపీడీఓగా సావిత్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు వీరు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. తిరిగి సొంత మండలాల్లో బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు అధికారులతో పలు అంశాలపై చర్చించారు.

ఆలూరు తహసీల్దార్‌గా గోవింద్ సింగ్



గోవింద్ సింగ్

ఆలూరు రూరల్: ఆలూరు నూతన తహసీల్దార్‌గా గోవింద్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లా రాయచోటి నుంచి బదిలీపై ఆలూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు. డిప్యూటీ తహసీల్దార్లు రజనీకాంత్ రెడ్డి, గుండాల్ నాయక్, సీనియర్ అసిస్టెంట్ బసవన్న గౌడ్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించి ఆహ్వానం పలికారు.

బాబూ.. బీద అరుపులు వద్దు

- ప్రాజెక్టుల సంగతి తేల్చండి
- నిధులు కేటాయించి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి
- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

ఆలూరు: శాసన సభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను పెట్టి నేడు గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయంలో అప్పులను మిగిల్చారని ఏపీ సీఎం చంద్రబాబు బీద అరుపులు అరుస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అన్నారు. మండల కేంద్రమైన చిప్పగిరిలో శ్రీ బోగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్య ధోరణిని వీడనాడాలన్నారు. రాయలసీమ, ఉత్తర కర్ణాటక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరప్రదాయినిగా ఉన్న తుంగభద్ర జలాశయం 19వ గేటు ఈనెల 10వ తేదీ రాత్రి 12.30 గంటల సమయంలో కొట్టుకుపోవడంతో భారీగా నదిలోకి వరద నీరు పోట్టెందన్నారు. ఇందుకు నిపుణల కమిటీ ఏర్పాటు, నిధులు కేటాయించడంలో సీఎం స్పష్టత ఇవ్వడంలో నిర్లక్ష్యం ధోరిణి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టీబీ డ్యాంలో 105.48 టీఎంసీల నీరు నిలువ ఉందని అయితే 33 గేట్ల ద్వారా దాదాపు 60 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేయడంతో ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు సబ్ డివిజన్లలో దాదాపు 1.99 లక్షల ఎకరాలలో పంటల సాగుకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదరం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రాష్ట్రంలోని శ్రీశైలం, నాగార్జున సాగర్, సుంకేసుల తదితర ప్రాజెక్టుల భద్రతకు నిపుణల కమిటీని నియమించి, మరమ్మతుల పనులకు నిధులను కేటా యించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి: అల్లుగుండు ఫీడర్ కింద 11కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లుగుండు, నార్లపురం, బొమ్మిరెడ్డిపల్లి, మల్లెపల్లి గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. తెల్లవారుజామున 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేజ్ కింద సరఫరా ఉంటుందని, ఈ విషయాన్ని వినియోదారులు గమనించాలన్నారు.

నల్ల మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి: మండలంలోని ఎర్ర చెరువులో అక్రమంగా నల్ల మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మట్టి తరలించే ప్రాంతాన్ని పరిశీలించారు. కొందరు నాయకులు అండదండలతో ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇటుక బట్టీలకు నల్ల మట్టి తరలిస్తున్నారని, అధికారులు తక్షణమే స్పందించి అరికట్టాలని కోరారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతపై ప్రచారం

కృష్ణగిరి: శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతపై డోన్ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు నాగార్జున సోమవారం సమితి సభ్యులతో కలిసి మాదాపురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అన్ని గ్రామాల్లో ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వెంకటేశ్వర్లు, శివకుమార్, సుంకన్న, శ్రీరాములు, శశికళ, అజయ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

వెల్దుర్తి: ఇటీవల బదిలీల్లో వెల్దుర్తి తహసీల్దార్‌గా వచ్చిన చంద్రశేఖర్‌వర్మ, ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్పను ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ ఆధ్వర్యంలో నాయకులు టైలర్ రాముడు, రామగిడ్డయ్య, సుపేష్, పెద్ద రంగడు తదితరులు సోమవారం సన్మానించారు.